# తోలు బొమ్మలు

దిబ్బరాజ్యం అధోగతిలో ఉండగా అక్కడికి తోలుబొమ్మలాట మొదటిసారిగా వచ్చింది. అది దిబ్బ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించవలసిన రోజు. అంతకు పూర్వం దిబ్బలో అన్ని కళలూ ఉన్నాయి. కాని పరిశ్రమలు లేక కళలు గుంటపూలు పూసాయి. తిండిలేక జనం ఎడా పెడా చచ్చారు. దేశంలో అరాజకం ఏర్పడింది.

తోలుబొమ్మలు జనాన్ని ఆకర్షించాయి. వాళ్లు ఆకలి దప్పులు మరిచారు. తోలుబొమ్మలు ఒక మహత్తర సాంస్కృతికోద్యమమూ, అంతకన్న మహత్తర పరిశ్రమా అయి కూర్చున్నది.

కవులు కొత్త తోలుబొమ్మలాటలు రాశారు. గాయకులు తోలుపాటలు పాడారు. కళాకారులు రంగాలంకరణ చేశారు. నేపథ్య తోలు నటులకు ఇంతా అంతా అని చెప్పటానికి వీల్లేని ఖ్యాతి వచ్చింది. తోలు పరిశ్రమలో లక్ష్మి తాండవించింది. బావులూ, చెరువులూ తవ్వించటానికి ఎగ్ర ఏగానీ చందా ఇయ్యనివాళ్లు, తోలు పరిశ్రమలో లక్షలు పెట్టుబడి చేశారు. తోలు కళాకారులు మంత్రులను మించి సంపాదించారు.

తోలు సంస్కృతిని అధికారరీత్యా గుర్తించక తప్పలేదు. తోలునటులకూ, కవులకూ, కళాకారులకూ, గాయకులకూ, "రాజపూజిత", "రాజోపచార", "తోలు కళాసార్వభౌమ" వగైరా బిరుదనామాలూ అవీ ఏర్పాటయాయి.

తోలు పరిశ్రమకు సంబంధించిన స్త్రీలూ, పురుషులూ దిబ్బ సంస్కృతికి మహా లావాటి పట్టుకొమ్మలై, సాంస్కృతిక సప్తాహాలూ, దశాహాలూ జరిగినప్పుడు పెత్తనం చేశారు.

దిబ్బలో అరాజకం పోయి ప్రజాస్వామ్యం అవతరించింది.

***ముద్రణ : యువ, మార్చ్ 1977***